# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక

సంచిక : 255 | సంపుటి : 2 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | బుధవారం | అక్టోబర్ | 23-10 -2024 | వెల : .రూ. 5.00



## విలేకరులు కావలెను

తెలంగాణ & ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్):
& చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు
- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు
- RC ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు

–జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:– 9705770909 సంప్రదించండి.







# ఎన్ఐసికి ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యత

మూడేండ్ల పాటు నిర్వహణ బాధ్యత

- పనితీరు బాగుంటే మరో రెండేళ్ల పెంపు
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర సర్కారు
- ఈ నెల 29తో ముగియనున్న ప్రస్తుత సంస్థ గడువు
- ఈ నెల 25న సెక్రటేరియట్ లో జాయింట్ మీటింగ్

అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)హైదరాబాద్,

ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతలను కేంద్ర ప్రభుత్వ సంస్థ నేషనల్ ఇన్ఫర్మేటిక్స్ సెంటర్ ఎన్ఐసీకి రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ

-మిగతా 2 లో



# సవాళ్ల సమయంలోనూ అభివృద్ధి బాట

- నూతన అవకాశాలను అందిపుచ్చుకుంటున్న భారత
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడి

అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)¬న్యూఢిల్లీ,

ప్రపంచం సవాళ్లను ఎదుర్కొంటున్న వేళ కూడా నూతన వృద్ధి అవకాశాలను అందిపుచ్చుకోవడంలో భారత్ మెరుగైన స్థానంలో ఉందని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అన్నారు. వస్తు, సేవల విభాగంలో అనేక దేశాలకు భారత్ కీలక భాగస్వామిగా మారాలని భావిస్తోందన్నారు. కొలంబియా యూనివర్సిటీలో

-మిగతా 2 లో

# నేడు వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్



- హాజరవుతున్న సోనియా, రాహుల్, ఖర్గే
- నామినేషన్ కార్యక్రమానికి రేవంత్ రాక

తిరువనంతపురం,

కేరళలోని వయనాడ్ లోక్‌సభ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా తొలిసారి ఎన్నికల బరిలోకి దిగుతున్న ప్రియాంక గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. 23వ తేదీ బుధవారంనాడు ఆమె నామినేషన్ వేయనున్నట్టు పార్టీ వర్గాల సమాచారం ఇచ్చాయి. ప్రియాంక నామినేషన్ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, పార్టీ మాజీ అధ్యక్షులు సోనియాగాంధీ, రాహుల్ గాంధీ హాజరవుతున్నారు. మధ్యాహ్నం 11 గంటలకు కల్పెట్ట న్యూ బస్టాండ్ నుంచి రాహుల్, ప్రియాంక కలిసి రోడ్‌షోలో పాల్గొంటారు. అక్కడి నుంచి నేరుగా జిల్లా

-మిగతా 2 లో

# ఇవాళ రేపు భారీ వర్షాలు..

- తీరం వైపు దూసుకొస్తున్న వాయుగుండం
- వంద కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు
- ఉభయ తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



అమరావతి/హైదరాబాద్,

ఈనెల 23,24వ తేదీల్లో ఏపీలో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించింది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వాయుగుండంగా మారి బుధవారం నాటికి తుఫాన్‌గా బలపడనుందని వెల్లడించింది. రెండు రోజుల పాటు ఉత్తరకోస్తాలో భారీ వర్షాలు కురుస్తాయని స్పష్టం చేసింది. తీరం వైపు వెళ్లే కొద్దీ తుఫాన్ మరింత బలపడనున్నట్లు అధికారులు తెలిపారు. తుఫాను తీరందాటే సమయంలో గంటకు 100-110 కి.మీ వేగంతో ఈదురుగాలులు వీస్తాయని, సముద్రం అలజడిగా ఉంటుందని, మత్స్యకారులు వేటకు

-మిగతా 2 లో



# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ సెంట్రల్ హాల్

- కేటీఆర్ ఇఆర్సీ వద్దకు వెళ్లడం జోక్
- ఫోన్ ట్యాపింగ్‌లో బండారం బయటకపడక తప్పదు
- మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్,

పార్లమెంట్ సెంట్రల్ హాల్ తరహాలో అసెంబ్లీ, కౌన్సిల్ ఒకే దగ్గర ఏర్పాటు చేస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి వెల్లడించారు. తెలంగాణ అసెంబ్లీని అఘాఖాన్ ట్రస్ట్ రూ. 49 కోట్ల అంచనాతో రెనోవేట్ చేస్తుందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. 3 నెలల్లో అసెంబ్లీలో చేపట్టిన పనులు పూర్తి చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పారని అన్నారు. నిజాం తరహాలో అసెంబ్లీని ఎలా కట్టారో అలా మార్పులు చేస్తున్నామని తెలిపారు. మంగళవారం అసెంబ్లీలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పనులను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ....

-మిగతా 2 లో



# రష్యాలో బ్రిక్స్ దేశాల సదస్సు

- రష్యాకు చేరుకున్న ప్రధాని మోడీ

న్యూఢిల్లీ,

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల రష్యా పర్యటనకు బయల్దేరారు. రష్యాలోని కజాన్‌లో 16వ బ్రిక్స్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటారు. ఈ పర్యటనలో ప్రధాని బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల

-మిగతా 2 లో

## ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడు

# దారుణ హత్య



- మీకో దండం.. మీ పార్టీకో దండ
- కాంగ్రెస్ హయాంలో ఇంత దారుణమా
- బిఆర్ఎస్ రాజ్యంలో ఉంది ..
- ప్రమాదం ఉన్నదని చెప్తూనే ఉన్నా..
- హత్యకు నిరసనగా అనుచరులతో కలిసి జీవన్‌రెడ్డి ధర్నా
- హత్యను తీవ్రంగా ఖండించిన ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్

అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)జగిత్యాల,

కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ముఖ్య అనుచరుడు, మాజీ ఎంపీటీసీ మారు గంగారెడ్డి (58) దారుణహత్యకు గురయ్యారు. జగిత్యాల జిల్లా జాబితాపూర్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది. ఆదివారం ఉదయం సంతోష్ అనే వ్యక్తి గంగారెడ్డిని కారుతో ఢీకొట్టాడు. ఆ తర్వాత కత్తితో పొడిచాడు. తీవ్రగాయాలపాలైన గంగారెడ్డిని స్థానికులు ఆస్పత్రికి తరలిస్తుండగా

-మిగతా 2 లో



# శాంతిభద్రతలపై వివేకంతో ఆలోచించండి

## బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)హైదరాబాద్,

రాష్ట్రంలో శాంతి భద్రతలు కాపాడే విషయంలో ఇకనైనా ప్రభుత్వ పెద్దలు వివేకంతో ఆలోచించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని సూచించారు.

-మిగతా 2 లో

# ఎన్ఐసికి ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యత

(మొదటి తరువాయి)

మేరకు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్రంలోని వ్యవసాయ భూముల లావాదేవీల అంశాన్ని మూడేండ్ల పాటు నిర్వహించాలని సూచించింది. పనితీరు బాగుంటే మరో రెండేండ్లు పెంచుతామని ఉత్తర్వుల్లో వివరించింది. బీఆర్ఎస్ ప్రభుత్వం 2020 అక్టోబర్ 29న ధరణి పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చింది. నిర్వహణ బాధ్యతను టెర్రా సీఐఎస్ టెక్నాలజీస్ లిమిటెడ్ కంపెనీకి అప్పగించింది. వ్యవసాయ భూముల అమ్మకం, కొనుగోళ్లు అన్నీ ధరణి పోర్టల్ ద్వారానే కొనసాగుతున్నాయి. ఈ పోర్టల్ లో ప్రస్తుతం 35 రకాల మాడ్యుల్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రతి సమస్యకు ఇందుకు సంబంధించి రిజిస్ట్రేషన్ ఫీజులను ధరణి పోర్టల్ ఆన్?లైన్?లోనే వసూలవుతున్నాయి. భూ సమస్యల పరిష్కారానికి ఒక్కో అప్లికేషన్‌కు వెయ్యి రూపాయల చొప్పున వసూలు చేస్తున్నారు. ఇప్పటి దాకా మొత్తం సుమారు 40 లక్షల లావాదేవీలు అయినట్లు సమాచారం. ప్రాథమిక సమాచారం నమోదులో జరిగిన అలసత్వం కారణంగా రైతులు అనేక ఇబ్బందులు పడ్డారు. ఎప్పుడో కొనుగోలు చేసి సాగు చేసుకుంటున్న భూములకు, గతంలో అమ్మినవాళ్ల పేర్లు రావడం, కొన్నిచోట్ల పట్టా భూములు ప్రభుత్వ, అసైన్డ్? భూములుగా నమోదవడం గమనార్హం. విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులు.. పట్టాభూమి అయినప్పటికీ నిషేధిత జాబితాలో ఉండటం కూడా సమస్యాత్మకంగా మారింది. పేర్లు తప్పుగా నమోదు కావడం, కొందరు భూము లు అసలు ధరణిలోనే నమోదు గాకపోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో గ్రామాల్లో భూ వివాదాలు పెరిగిపోయాయి. వాటిని పరిష్కరించేందుకు ధరణి పోర్టల్ ను సమూలంగా ప్రక్షాళన చేస్తామని ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అధికారంలోకి రాగానే ధరణి ప్రక్షాళన కోసం సబ్ కమిటీ వేసి విచారణ చేపట్టింది. కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి, రిటైర్డ్ ఐఏఎస్ పీటర్ అడ్వొకేట్ సునీల్, మాజీడిప్యూటీ కలెక్టర్ మధుసూదన్ సహా సీసీఎల్ఏ మెంబర్ కన్వీనర్ ధరణీ కమిటీలో సభ్యులు. ధరణీ సమస్యలు, పరిష్కారాలపై ఈ కమిటీ అధ్యయనం చేసింది. ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను ఎన్ఐసీకి అప్పగిస్తున్న నేపథ్యంలో ఈ నెల 25న సెక్రటేరియట్ లో జాయింట్ మీటింగ్ నిర్వహించనున్నట్టు ప్రభుత్వం తెలిపింది. ఈ సమావేశానికి ప్రస్తుతం పోర్టల్ నిర్వహిస్తున్న టెర్రా సీఐఎస్ టెక్నాలజీస్ కంపెనీ ప్రతినిధులతో పాటు, నూతనంగా బాధ్యతలు నిర్వర్తించనున్న ఎన్ఐసీ అధికారులు, సాంకేతిక నిపుణులు, తెలంగాణ టెక్నాలజీ సర్వీసెస్ అధికారులు హాజరు కావాలని పేర్కొన్నది. ఆ రోజు ఉదయం 11 గంటలకు సచివాలయంలో గ్రౌండ్ ఫ్లోర్ లోని రూం నంబర్ 22లో ఈ జాయింట్ మీటింగ్ ఉంటుందని వివరించింది. టెరాసిస్ నుంచి ఎన్ఐసీకి అప్పగించడం ద్వారా దాదాపు కోటి రూపాయల నిర్వహణ భారం కూడా తగ్గుతుందని రెవెన్యూ అధికారులు భావిస్తున్నారు. అయితే ధరణి పోర్టల్‌కు చెందిన సాంకేతిక అంశాలను పూర్తి స్థాయిలో ఎన్ఐసీకి బదలాయించనున్నారు. నవంబరు 30వ తేదీ వరకు టెరాసిస్ సంస్థ సిబ్బంది ఎన్ఐసీకి సహకరిస్తారని రెవెన్యూ ప్రిన్సిపల్ సెక్రటర్ నవీన్ మిట్టల్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. మరోవైపు ధరణి పోర్టల్ స్థానంలో భూ మాత పేరుతో పోర్టల్ ఏర్పాటుకు సర్కార్ కసరత్తు చేస్తున్న విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా రైతులు ఏళ్ల తరబడి ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం నడుం బిగించింది. ధరణి వైఫల్యాలను అధిగమించే లక్ష్యంతో క్షేత్రస్థాయి అధ్యయానికి శ్రీకారం చుట్టింది. త్వరలో దేశానికే రోల్ మోడల్‌గా ఉండేలా నూతన ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చే పనిలో పడింది. ధరణి పోర్టల్‌ను ప్రైవేటు సంస్థ నుంచి ప్రభుత్వ ఎన్ఐసీకి బదలాయింపు పక్రియను సర్కార్ ఇటీవల పూర్తిచేసింది. ఇక పేరు మార్పు మారిస్తే పక్రియ పూర్తవుతుంది. ధరణి పోర్టలల్‌లో ఉన్న పెండింగ్ దరఖాస్తుల స్పెషల్ డ్రైవ్ ద్వారా దాదాపు పరిష్కరించారు. కొత్త చట్టంతో ముడిపడి ఉన్న అంశాలకు సంబంధించిన దరఖాస్తులే మిగిలి పోయినట్లు సంబంధిత వర్గాల సమాచారం. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక.. ధరణి సమస్యలకు చరమగీతం పాడాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. ఈ క్రమంలోనే ధరణి పోర్టల్ సమస్యలపై ప్రత్యేకంగా ఓ కమిటీని ఏర్పాటు చేశారు. ఆ కమిటీ చేత క్షేత్రస్థాయిలో అధ్యయనం చేయించారు. అందులో సేకరించిన విషయాలన్నింటినీ క్రోడీకరించి కొత్త ఆర్‌వోఆర్ చట్టాన్ని తెచ్చేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నది. క్షేత్రస్థాయిలో భూ సమస్యల అధ్యయానికి రాష్ట్రంలో రెండు మండలాలను ఎంపిక చేసింది. అందులో ఒకటి నల్లగొండ జిల్లాలోని తిరుమలగిరి మండలం. ఇక రెండోది రంగారెడ్డి జిల్లా యాచారం మండలం. నిర్ణీత కాలంలో భూ సమస్యలను పరిష్కరించి ఇక్కడ వచ్చిన ఫలితాల ద్వారా ఇదే నమూనాను రాష్ట్రమంతటా అమలు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది.

# ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అనుచరుడు దారుణ హత్య

(మొదటి తరువాయి)

మృతిచెందాడు. ఈ హత్యకు నిరసనగా జగిత్యాల పాతబస్టాండ్ వద్ద తన అనుచరులతో కలిసి జీవన్‌రెడ్డి ధర్నాకు దిగారు. కాంగ్రెస్ నాయకులకు రక్షణ లేనప్పుడు తామెందుకని తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం.. జగిత్యాలలో భారాస ప్రభుత్వమా అని మండిపడ్డారు. ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ముఖ్య అనుచరుడు మారు గంగారెడ్డి (55) హత్య రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. అనుచరుడి హత్యపై జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తన అనుచరుడిని హత్య చేయడం అంటే తనను కూడా హత్య చేసినట్లే అని ఎమ్మెల్సీ అన్నారు. హత్యకు నిరసనగా ఆస్పత్రి వద్దకు చేరుకుని నిరసనకు దిగారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని సంతోషపడాలా.. తన అనుచరులను చంపేస్తున్నారని బాధపడాలో తెలియని పరిస్థితిలో తాను ఉన్నానని



ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అన్నారు. తన అనుచరుడిని చంపిన నిందితుడు ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున డబ్బులు పంచారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలకు అడ్డువస్తే భౌతికంగా దాడులు చేస్తున్నారని మండిపడ్డారు. నిందితుడు తన అనుచరుడిని చంపేస్తానని ముందే హెచ్చరించాడని అన్నారు. అంత హెచ్చరించినా పోలీసులు కనీసం ఎందుకు పట్టించుకోవడంలేదని ప్రశ్నించారు. జరుగుతున్న పరిణామాలను తలుచుకుంటే గుండె తరుక్కుపోతుందని ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

ఇదిలా ఉండగా... మారు గంగారెడ్డి హత్యపై ఎమ్మెల్యే సంజయ్ ఆరా తీశారు. జగిత్యాల ఎస్పీకి ఎమ్మెల్యే ఫోన్ చేసి హత్య గురించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిందితులను కఠినంగా శిక్షించాలని, హత్యలో ప్రమేయం ఉన్న ఏ ఒక్కరినీ వదలొద్దని ఆదేశాలు జారీ చేశారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించే వారి పట్ల కఠినంగా వ్యవహరించండి అంటూ ఎస్పీకి ఎమ్మెల్యే సంజయ్ ఆదేశించారు.

# పార్లమెంట్ తరహాలో అసెంబ్లీ సెంట్రల్ హాల్


(మొదటి తరువాయి)

ఇప్పుడు అసెంబ్లీ నుంచి కౌన్సిల్‌కు వెళ్లాలంటే వాహనంలో సీఎం, మంత్రులు వెళ్లాల్సి వస్తోందని తెలిపారు. ఒకే దగ్గర ఉంటే టైం సేవ్ అవుతుందని చెప్పారు. మాజీ మంత్రి కేటీఆర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల అంశంపై ఈఆర్సీ దగ్గరకు వెళ్లటం పెద్ద జోక్ ..... ఆయన ఓ జోకర్ అని విమర్శించారు. పార్లమెంట్‌లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు కూడా రాలేదని, అసెంబ్లీ ఎన్నికల్లో ఓడించిన కూడా బీఆర్ఎస్ నేతలకు ఇంకా బుద్ధి రావడం లేదని మండిపడ్డారు. 200 యూనిట్ల ఫ్రీ కరెంటు పేదవారికి తమ ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ తెలంగాణ అభివృద్ధికి కేంద్రం నుంచి ఎన్ని నిధులు తెచ్చారని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ప్రశ్నించారు. భాధ్యత గల ప్రతిపక్షంగా మూసీ పునరుజ్జీవనానికి బీఆర్ఎస్ సహకరించాలని మంత్రి కోరారు. హైదరాబాద్ అభివృద్ధిలో మూసీని భాగస్వామ్యం చేయాలని ప్రభుత్వం భావిస్తోందని అన్నారు. నిర్వాసితుల కష్టాలు తమకు తెలుసునని అన్నారు.. నిర్వాసితులకు ఏ కష్టం రానివ్వమని చెప్పారు. పునరావాసం, విద్యా, వైద్యం, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.. కేటీఆర్ గతంలో విదేశీ పర్యటనలు ఎందుకు చేశారని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో త్వరలోనే వారి బండారం బయటపడుతుందని అన్నారు. అప్పుడు వారి రాజకీయ జీవితం క్లోజ్ అననారు.

# ఇవాళ రేపు భారీ వర్షాలు..

(మొదటి తరువాయి)

వెళ్లవద్దని హెచ్చరించారు. తూర్పుమధ్య బంగాళాఖాతంలో కేంద్రీకృతమైన అల్పపీడనం అక్టోబరు 24, 25న పూరీ, సాగర్ ద్వీపం మధ్య తీరం దాటే అవకాశం ఉందని ఈ ప్రభావంతో అనకాపల్లి విజయనగరం, మన్యం, శ్రీకాకుళం, విశాఖపట్నం, అల్లూరి జిల్లాల్లోని కొన్ని చోట్ల భారీ వర్షాలు, మిగిలిన చోట్ల విస్తారంగా తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్ కూర్మనాథ్ తెలిపారు. అలాగే తెలంగాణలో రాబోయే రెండురోజులు తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తర్వాత పొడి వాతావరణం ఏర్పడే అవకాశాలున్నాయని పేర్కొంది. తూర్పు మధ్య బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం గంటకు ఆరు కిలోమీటర్ల వేగంతో పశ్చిమ వాయువ్య దిశగా కదులుతుందని.. పారాదీప్‌కు 700 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమైందని తెలిపింది. పశ్చిమ వాయువ్య



దిశగా కదిలి తూర్పు మధ్య బంగాళాఖాతంలో బుధవారం నాటికి తుఫానుగా మారే అవకాశం ఉందని చెప్పింది. ఆ తర్వాత వాయువ్య దిశగా కదులుతూ 24వ తేదీ వరకు తీవ్ర తుఫానుగా మారుతుందని హెచ్చరించింది. అదే రోజు రాత్రి, 25న ఉదయం ఒత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతమైన పూరీ, సాగర్ ద్వీపం మధ్య తుఫాను తీరం దాటే అవకాశం ఉందని తెలిపింది. తుఫాను తీరం దాటే సమయంలో బలమైన ఈదురుగాలులు వస్తాయని.. గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని పేర్కొంది. అలాగే, ఉపరితల ద్రోణి వాయుగుండం నుంచి దక్షిణ తమిళనాడు తీరం వరకు సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తు వరకు విస్తరించి ఉందని చెప్పింది. ఈ క్రమంలో మంగళవారం రాష్ట్రంలో కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వివరించింది.

# సవాళ్ల సమయంలోనూ అభివృద్ధి బాట

(మొదటి తరువాయి)

నిర్వహించిన ఓ సదస్సులో పాల్గొన్న మంత్రి ఉపాధి కల్పన, ఆర్థిక వృద్ధి తదితర అంశాలపై మాట్లాడారు. దేశీయంగా సమర్థతను పెంచుకోవడంతో పాటు.. బయటి నుంచి వచ్చే సవాళ్లను తట్టుకొనేలా ఆర్థిక వ్యవస్థను తీర్చిదిద్దాలని భావిస్తున్నట్లు సీతా రామన్ చెప్పారు. భారత్‌లోని పెట్టుబడి అవకాశాలను ఆమె ప్రస్తావించారు. ఉపాధి కల్పనే దేశం ముందున్న అతిపెద్ద సవాలన్నారు. 'చాలా మంది యువత డిగ్రీ పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, తమకున్న అర్హతకు, సాధించిన ఉద్యోగానికి మధ్య వ్యత్యాసం ఉందని వారు భావిస్తున్నారు. ఈ లోటును భర్తీ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. కృత్రిమ మేధ వంటి సాంకేతికతల్లో నైపుణ్యాన్ని అందించేందుకు యువతను సన్నద్ధం చేస్తోంది' అని ఆర్థిక మంత్రి అన్నారు. యూన్గి÷డ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ గురించి ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. భారత్ ఎ÷-లాస్టిక్ కార్డుల నుంచి క్యూఆర్ కోడ్‌కు వేగంగా మారినట్లు ఆమె తెలిపారు. చిరు దుకాణాలు, కూరగాయల కోసం కూడా దీనిని వినియోగిస్తున్నామన్నారు. ఫలితంగా చెల్లింపులు మరింత పారదర్శకంగా మారాయని, నగదుపై ఆధారపడటం తగ్గిందన్నారు. థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నుంచి సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధనం వైపు వేగంగా మారుతోందన్నారు.

# రష్యాలో బ్రిక్స్ దేశాల సదస్సు

(మొదటి తరువాయి)

పురోగతిని అంచనా వేయడంతోపాటు.. ప్రపంచాభివృద్ధి, భద్రతపై చర్చిస్తారు. చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ ఇందులో పాల్గొంటారు. బ్రిక్స్‌కు భారత్ అధిక ప్రాధాన్యం ఇస్తోందని ప్రధాని మోదీ ట్వీట్ చేశారు. ఈ బ్రిక్స్ సదస్సులో పలువురు నేతలను కలుసుకుంటానని చెప్పారాయన. పలు అంశాలపై విస్తృతంగా చర్చ జరుగుతుందని మోదీ ట్వీట్‌లో తెలిపారు. ఈ పర్యటనలో ప్రధాని మోదీ బ్రిక్స్ సభ్య దేశాల అధినేతలతో ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తో ప్రత్యేకంగా భేటీ కానున్నారు. అంతేకాకుండా విడివిడిగా కూడా పలువురు నేతలను కలవనున్నట్లు తెలుస్తోంది.. ఈ సమ్మిట్ లో యుద్ధం సహా పలు కీలక అంశాలపై కూడా చర్చించనున్నట్లు తెలుస్తోంది. బ్రిక్స్ ప్రారంభించిన కార్యక్రమాల పురోగతిని అంచనా వేయడంతోపాటు.. ప్రపంచాభివృద్ధి, ఆర్థిక వృద్ధి, భద్రతపై చర్చించనున్నారు. ఈ క్రమంలో ప్రధాని మోదీ ప్రసంగంపై ఉత్కంఠ నెలకొంది. ప్రధాని మోదీ నాలుగు నెలల్లో రష్యా పర్యటనకు వెళ్లడం ఇది రెండోసారి. ఈ ఏడాది జులైలో మోదీ రష్యాలో పర్యటించారు. యుక్రెయిన్‌పై రష్యా దాడి తరువాత మాస్కోలో ప్రధాని తొలిసారి పర్యటించారు. రష్యాలోని భారత సంతతి ప్రజలతో ముఖాముఖిలో పాల్గొన్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ ఆహ్వానం మేరకు కజాన్ వేదికగా జరిగే 16వ బ్రిక్స్ సమ్మిట్‌లో మోదీ పాల్గొంటున్నారు. 2006లో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా దేశాలు బ్రిక్ గ్రూపును ప్రారంభించాయి. 2010లో దక్షిణాఫ్రికా చేరిన తరువాత అది బ్రిక్స్‌గా మారింది. ఈ ఏడాది జనవరిలో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు కూడా చేరాయి. దీంతో బ్రిక్స్ గ్రూపులో ఉన్న దేశాల సంఖ్య పదికి చేరింది.

# శాంతిభద్రతలపై వివేకంతో ఆలోచించండి

(మొదటి తరువాయి)

రాష్ట్రంలో శాంతిభద్రతలు అదుపుతప్పడంపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి అసహనం వ్యక్తం చేసిన నేపథ్యంలో కేటీఆర్ ట్విట్టర్ (ఎక్స్) వేదికగా స్పందించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు అదుపు తప్పాయని కొన్ని నెలల నుంచి జనం ఆందోళన వ్యక్తం చేస్తూనే ఉన్నారని కేటీఆర్ తెలిపారు. ఇప్పుడు అదే విషయాన్ని స్వయంగా కాంగ్రెస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి, ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి కూడా ఆవేదనతో చెబుతున్నారని పేర్కొన్నారు. తెలంగాణలో అదుపు తప్పిన లా అండ్ ఆర్డర్ పరిస్థితి చూస్తుంటే ఆందోళన కలుగుతోందని అన్నారు. రాష్ట్రానికి హోంమంత్రి లేకపోవటం, పోలీసులు రాజకీయ వ్యవహారాల్లో బిజీగా ఉండటంతోనే ఈ సమస్య తలెత్తిందని అభిప్రాయపడ్డారు. ఇకనైనా శాంతి భద్రతలు కాపాడే విషయంలో ప్రభుత్వ పెద్దలు వివేకంతో ఆలోచించాలని కేటీఆర్ కోరారు. పోలీసు ఉన్నతాధికారులకు పూర్తి స్వేచ్ఛనివ్వాలని సూచించారు. రాష్ట్రంలో సమర్థవంతమైన పోలీసు ఉన్నతాధికారులు ఉన్నారని.. వారి పని వారిని చేసుకొనిస్తే శాంతి భద్రతలు, రాష్ట్రంలో సామరస్యాన్ని కాపాడగలుగుతారని అన్నారు.

# నేడు వయనాడ్‌లో ప్రియాంక నామినేషన్

(మొదటి తరువాయి)

కలెక్టర్ కార్యాలయానికి చేరుకుంటారు. మధ్యాహ్నం12 గంటలకు ప్రియాంక నామినేషన్ వేస్తారు. ఐదేళ్లుగా పార్టీ క్రియాశీలక రాజకీయాల్లో ఉంటున్న ప్రియాంకగాంధీ తొలిసారి ఎన్నికల పోటీలోకి దిగుతున్నారు. ఇటీవల లోక్‌సభ ఎన్నికల్లో రెండు చోట్ల గెలిచిన రాహుల్ గాంధీ వయనాడ్ నియోజకవర్గాన్ని వదులుకోవడం అక్కడ ఉపఎన్నిక అనివార్యమైంది. గత వారంలో రెండు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలతో పాటు పలు రాష్ట్రాల్లోని అసెంబ్లీ స్థానాలు, లోక్‌సభ స్థానాలకు ఉపఎన్నికలను ఈసీ ప్రకటించింది. ఆ వెంటనే వయనాడ్ నుంచి ప్రియాంకగాంధీని తమ అభ్యర్థిగా కాంగ్రెస్ ప్రకటించింది. నవంబర్ 13న వయనాడ్ లోక్‌సభకు ఎన్నిక జరుగనుండగా, నవంబర్ 23న ఫలితాలు వెలువడతాయి. కాగా, వయనాడ్‌లో ప్రియాంక గాంధీకి పోటీగా నవ్య హరిదాస్‌ను బీజేపీ పోటీలోకి దింపింది. బీజేపీలో డైనమిక్ నేతగా నవ్య హరిదాస్‌కు పేరుంది. వృత్తిరీత్యా మెకానికల్ ఇంజనీర్ అయిన ఆమె 2007 బీటెక్ పూర్తి చేశారు. కోజికోడ్ కార్పొరేషన్ కౌన్సిలర్‌గా, బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కూడా నవ్యహరిదాస్ సేవలందించారు.ఇదిలావుంటే మంగళవారం ఢిల్లీలోని తన నివాసం నుంచి రాహుల్ సోదరిత ప్రియాంకతో కలిసి వాయనాడ్ కు బయలుదేరారు. బుధవారం వాయనాడ్ లోక్‌సభ స్థానానికి కాంగ్రెస్ అభ్యర్థిగా ప్రియాంకాగాంధీ వాద్రా నామినేషన్ వేయనున్నారు. ఈ నేపథ్యంలో సోదరితో కలిసి రాహుల్‌గాంధీ వాయనాడ్‌కు బయలుదేరారు. రాత్రికి అక్కడే బస చేసి రేపు నామినేషన్ దాఖలు చేయనున్నారు. తాను రాజీనామా చేసినా తాను ఇక్కడి ప్రజలకు దూరం కాబోనని, ఇక్కడి నుంచి తన సోదరిని బరిలో దించుతామని చెప్పారు. ఈ నేపథ్యంలోనే ఇటీవల కాంగ్రెస్ హైకమాండ్ ప్రియాంకాగాంధీని వాయనాడ్ లోక్‌సభ అభ్యర్థిగా ప్రకటించింది. ఇదిలావుంటే ప్రియాంక నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు తెలంగాణ సిఎం రేవంత రెడ్డి మంగళవారం సాయంత్రం కేరళకు బయలుదేరారు.

## వనపర్తి పట్టణ ఎస్సైగా పదవి బాధ్యతలు చేపట్టిన హరి ప్రసాద్




**వనపర్తి అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి పట్టణ ఎస్సైగా మంగళవారం బి,హరిప్రసాద్ పదవి బాధ్యతలు స్వీకరించారు. వనపర్తి ఎస్సై బి,హరి ప్రసాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ రావుల గిరిధర్ ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని శాంతి భద్రతల పరిరక్షణలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. హరి ప్రసాద్ వనపర్తి జిల్లా గోపాల్పేట్ పోలీస్ స్టేషన్లో ఎస్సైగా విధులు నిర్వహిస్తూ వనపర్తికి బదిలీపై వచ్చారు. వనపర్తి పట్టణ ఎస్సైగా పనిచేసిన జయన్న నాగర్ కర్నూల్ జిల్లా సిసిఎస్ ఎస్సైగా బదిలీపై వెళ్ళారు. శాంతిభద్రతల పరిరక్షణకు వనపర్తి పట్టణ ప్రజలు సహకరించాలని నూతన ఎస్సైగా బాధ్యతలు స్వీకరిస్తూ ఆయన ప్రజలను కోరారు.

# రైతులు, వ్యవసాయ దారులు దీర్ఘకాలిక రుణాలను సద్వినియోగం చేసుకోవాలి

**ఆమనగల్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్ సింగల్ విండో ద్వారా రైతన్నలు, వ్యవసాయ దారులకు దీర్ఘకాలిక రుణాలు అందజేయడం జరుగుతుంది. వాటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా డిసిసిబి డైరెక్టర్, ఆమనగల్లు, కడ్తాల సింగల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా తెలిపారు.



సింగల్ విండో చైర్మన్ వెంకటేష్ గుప్తా ఆధ్వర్యంలో మంగళవారం ఆమనగల్ సింగల్ విండో కార్యాలయంలో పాలకవర్గంతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించారు. రైతన్నలు మధ్య దళారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధర పొందాలని సూచించారు. నవంబర్ మొదటి వారంలో ఆమనగల్ ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆమనగల్లు, కడ్తాల్ మండలాలలో చెరో రెండు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం సన్న రకం వడ్లకు ప్రోత్సాహకంగా రూ. 500 అందజేయనున్నట్లు తెలిపారు. ఆమనగల్ సింగల్ విండో, సహకార బ్యాంకుల ద్వారా గోట్ ఫార్మ్, ట్రాక్టర్, వ్యవసాయ పరికరాలు, పౌల్ట్రీ, డైరీ, జెసిబి మరియు వ్యవసాయ అభివృద్ధి కోసం దీర్ఘకాలిక రుణాలు అందిస్తామన్నారు. అర్హులైన రైతన్నలు, రైతు కార్మికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలనీ సూచించారు. ఈ కార్యక్రమంలో మాడుగుల సింగల్ విండో చైర్మన్ తిరుమల్ రెడ్డి, ఆమనగల్ సింగల్ విండో వైస్ చైర్మన్ దోనాదుల సత్యం, డైరెక్టర్లు జోగు వీరయ్య, బెల్లి వెంకటయ్య, డిసిసిబి మేనేజర్ గోపాల్, సీఈఓ దేవేందర్, సింగల్ విండో సిబ్బంది పద్మాకర్ రెడ్డి, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల బదిలీతో విద్యార్థులకు అన్యాయం

**- జంతుక శంకర్**



**రంగారెడ్డి, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)** రంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి డిప్యూటేషన్ పేర మారుమూల మండలాల్లో విద్యను బోధిస్తున్న ఉపాధ్యాయులను బదిలీ చేయడం ఆమనగల్, కడ్తాల మండల విద్యార్థులకు తీవ్ర అన్యాయం చేస్తున్నారని సోషల్ లిస్ట్ విద్యార్థి సంఘం రాష్ట్ర కోఆర్డినేటర్ జంతుక శంకర్ అన్నారు. ఆమనగల్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 300 మంది విద్యార్థులకు వ్యాయామ ఉపాధ్యాయురాలిగా జ్యోతి విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా, కడ్తాల మండలం రావిచెడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సాంఘిక ఉపాధ్యాయురాలిగా శ్రీదేవి 6వ తరగతి నుండి పదవ తరగతి వరకు విద్యను బోధిస్తున్నారు. ఇప్పటికే జిల్లా కేంద్రంలో మారుమూల మండల కేంద్రాల్లో నివసిస్తున్న విద్యార్థులకు సరైన బోధన అందకపోవడం వల్ల విద్యారంగంలో వెనుకబడి ఉన్నారని, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థులు ఆరోగ్యపరంగా, మానసికంగా దృఢంగా ఉండాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ, రంగారెడ్డి జిల్లా డీఈవో నిర్ణయం రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయానికి భిన్నంగా ఉందని తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి, డిప్యూటేషన్ ద్వారా బదిలీ చేసిన ఉపాధ్యాయులను తిరిగి యధాస్థితిగా కొనసాగించాలని, అవసరమైతే కర్మన్ఘాట్ జిల్లా పరిషత్ పాఠశాల అబ్దుల్లాపూర్ మండలం అట్టి అన్నారం లో కాంట్రాక్టు ప్రాతిపదికన నియమించాలని కోరారు.

## షాద్ నగర్-ఆమనగల్ రూట్‌లో బస్సుల సమస్యపై విద్యార్థుల లేఖ



**ఆమనగల్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తెలంగాణ ఆర్టీసీ బస్సు సేవలపై ప్రజల నుంచి ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని, ఆమనగల్ విద్యార్థులు ఆర్టీసీ ఎండీ సజ్జనార్‌కి లేఖ రాశారు. ఆర్టీసీ బస్సుల తీరుపై ఆవేదన వ్యక్తం చేస్తూ, తగినన్ని బస్సులు నడపాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థులు, బస్సుల్లో స్కూళ్లు, కాలేజీలకు వెళ్లేందుకు పడుతున్న ఇబ్బందులను సజ్జనార్ దృష్టికి తీసుకెళ్లారు. బస్సుల్లో ఫుట్బోర్డు పై వేలాడుతున్న వీడియోలను షేర్ చేసి, ప్రయాణంలో ఎదుర్కొంటున్న సమస్యలను సజ్జనార్ దృష్టికి తీసుకొచ్చారు. షాద్ నగర్-ఆమనగల్ రూట్‌లో గతంలో 10 బస్సులు నడిపితే, ఇప్పుడు 4 బస్సులే నడుపుతున్నారని, ఈ రూట్లో బస్సుల సంఖ్యను పెంచాలని విద్యార్థులు తమ లేఖలో కోరారు. బస్ పాస్ విషయంలో ఆర్టీసీ విధించిన 35 కిలోమీటర్ల పరిమితి డిగ్రీ, హయ్యర్ ఎడ్యుకేషన్ చేసే వారి కోసం సరిపోవడం లేదని, బస్ పాస్ పరిమితిని 45, 60 కిలోమీటర్ల వరకు పెంచాలని డిమాండ్ చేశారు.

## అడవి బిడ్డల హక్కులకై పోరాడిన
# తెలంగాణ ఉక్కుమనిషి కొమరం భీమ్

**-గంగవరం రామకృష్ణారెడ్డి**



**వనపర్తి అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అడవి బిడ్డల హక్కుల కోసం ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి అడవి బిడ్డలకు ప్రత్యేక హక్కులు సాధించిన ఉక్కుమనిషి కొమరం భీమని వనపర్తి కాంటెస్ట్ ఎమ్మెల్యే గంగవరం రామకృష్ణారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొమురం భీమ్ తెలంగాణ విముక్తి కోసం అసఫ్ జహి రాజవాసానికి వ్యతిరేకంగా పోరాడిన ఆదిలాబాద్ జిల్లాకు చెందిన గిరిజనోద్యమ నాయకుడని,ఇతనుఆదిలాబాద్ అడవులలో, గోండు కుటుంబంలో జన్మించారు. గిరిజన గోండు తెగకు చెందిన కొమరం చిన్నూ మరియు సోంబాయి దంపతులకు ఆదిలాబాద్ జిల్లా, ఆసిఫాబాద్ తాలూకాలోని సంకేపల్లి గ్రామంలో 1901 సంవత్సరంలో జన్మించాడని భీమ్ పదిహేనేళ్ల వయసులో అటవీశాఖ సిబ్బంది జరిపిన దాడిలో తండ్రి మరణించగా, కొమరం కుటుంబం కరిమెర ప్రాంతంలోని సర్దాపూర్ అను ప్రాంతానికి వలస వెళ్లిందని ఆయన అన్నారు. కొమరం భీమ్ నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా గొరిల్లా శైలిలో పోరాడాడు, ఇతను అడవిని జీవనోపాధిగా చేసుకొని, అతను అన్ని రకాలగా నిజాం నవాబ్ సైనికులకు వ్యతిరేకంగా ఆయుధాలు చేత పట్టి,పశువుల కాపర్లపై విధించిన సుంకానికి వ్యతిరేకంగా, తమ భూమిలో తమదే అధికారం అని జల్, జంగల్, జమీన్ (నీరు,భూమి. అడవి) మాదే అనే నినాదంతో ఉద్యమించి వీరమరణం పొందాడు. కొమరం భీమ్లాంటి నాయకులను స్ఫూర్తిగా తీసుకొని తెలంగాణ ఉద్యమం మొదలై ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిందనిఆయన అన్నారు.

## బుద్ధారంలో విద్యాపరంగా రామ్మూర్తి సేవలు ఘణనీయం..

-ప్రభుత్వ ఉద్యోగాలకు నిలయంగా దామోదర్ రెడ్డి పాఠశాల..
-పట్టుదల ఉంటే ఏదైనా సాధించొచ్చు..
-విద్యార్థులను ఆణిముత్యాలుగా తీర్చిదిద్దిన రామ్మూర్తి..
-రామ్మూర్తిని సన్మానించిన బుద్దారం గ్రామ పెద్దలు,పూర్వ విద్యార్థులు.
-DSC లో టీచర్ ఉద్యోగాలను సాధించిన పూర్వ విద్యార్థులకు సన్మానం



**గోపాలపేట అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వనపర్తి జిల్లా గోపాలపేట మండలం బుద్దారం గ్రామంలోని దామోదర్ రెడ్డి ప్రాథమిక ప్రవేట్ పాఠశాలలో చదివిన ఇద్దరు పూర్వ విద్యార్థులు ప్రభుత్వం ఈ మధ్య వేసిన DSC లో టీచర్ ఉద్యోగాలను సాధించారు..సైన్స్ విభాగంలో జిల్లా ఫస్ట్ ర్యాంక్ పొందిన మనీషా మరియు స్కూల్ అసిస్టెంట్ ఉద్యోగం పొందిన వద్ది రాము ఇద్దరికీ స్కూల్ స్థాపకులు అయినటువంటి రామ్మూర్తి మరియు గ్రామ పెద్దలు, పూర్వ విద్యార్థులు కలిసి మెమోంటో ఇచ్చి శాలువాలతో సన్మానం చేయడం జరిగింది..

# ఏసీబీకి చిక్కిన మున్సిపల్ కమిషనర్

**-20వేలు లంచం తీసుకుంటుండగా పట్టుకున్న అధికారులు**



**పెబ్బేరు అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పెబ్బేర్ మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఏసీబీ దాడులు నిర్వహించారు. రూ.20000/లు లంచం తీసుకుంటుండగా మున్సిపల్ కమిషనర్ ఆదిశేషు ను మహబూబ్ నగర్ ఏసీబీ అడిషనల్ ఎస్పీ బి.శ్రీకృష్ణ గౌడ్ పట్టుకున్నారు. . ఏసీబీ అడిషన ల్ ఎస్పీ బి.శ్రీకృష్ణ ష్ట గౌడ్ మాట్లాడుతూ గత ఏడాది ఒక కాంట్రాక్టర్ చేసిన పనులకు రూ.2.6 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ బిల్లుల చెల్లింపు కోసం రూ.25000/ల లంచం ఇవ్వాలని కమిషనర్ డిమాండ్ చేయగా, కాంట్రాక్టర్ రిక్వెస్ట్ మేరకు రూ.20000/కు అంగీకరించారు. దీంతో కాంట్రాక్టర్ ఏసీబీని ఆశ్రయించారు. లంచం తీసుకుంటుండగా దాడి ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.20000/ తీసుకుం టుండగా మున్సిపల్ కమిషనర్ ఆదిశేషును ప ట్టుకున్నామని అడిషనల్ ఎస్పీ బి.శ్రీకృష్ణ గౌడ్ తెలిపారు. ఏసీబీ అధికారులను కాంట్రాక్టర్ ఫిర్యాదు చేయగా, తాము నోట్లు ఇచ్చామని, అవే నోట్లను కమిషనరు కాంట్రాక్టర్ ఇచ్చారన్నారు. కాంట్రాక్టర్ లంచం ఇచ్చి బయటకు వచ్చిన త ర్వాత తాము వెళ్లి పట్టుకున్నామని చెప్పారు. తన తోపాటు పది మంది సిబ్బంది ఉన్నారన్నారు. ఇంకా సోదాలు జరుగుతున్నాయని తెలిపారు.

**రేపు నాంపల్లి కోర్టులో హాజరు**

లంచం తీసుకుంటున్న మున్సిపల్ కమిషనర్ ఆదిశే షును విచారణ అనంతరం అరెస్టు చేసిన నాంప ల్లిలో ఉన్న ఏసీబీ కోర్టులో హాజరు పరుస్తామని శ్రీ కృష్ణగౌడ్ తెలిపారు. ప్రస్తుతానికి అన్ని కోణాల నుంచి దర్యాప్తు చేస్తున్నామని, రికార్డులు కూడా త నిఖీ చేస్తున్నామని చెప్పారు.

## గ్రూప్ 1 పరీక్షలను ఎవరు ఆపలేరు

**- ముదిగొండ రమేష్**



**వెల్దండ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)** ప్రభుత్వం ఉద్యోగాల నియామకం చేపడుతుంటే ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని, పది సంవత్సరాలలో గ్రూప్ 1 నిర్వహించలేని వారు ఈరోజు కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తుంటే వారి అక్కసు కక్కుతున్నారని వెల్దండ మండల ఎస్సి సెల్ మండల అధ్యక్షులు ముదిగొండ రమేష్ అన్నారు. విలేకరుల సమావేశంలో మంగళవారం గ్రూప్ 1 పరీక్ష విషయం గురించి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, విద్యార్థుల జీవితాలతో ఆడుకోవడం, విద్యార్థులను వాడుకోవడం ప్రతిపక్షాలకు అలవాటు కానీ, ప్రభుత్వం అప్పుడే 40 వేల ఉద్యోగాలు భర్తీ చేసిందని, ఈరోజు గ్రూప్ 1 స్థాయి ఉద్యోగాలను భర్తీ చేయడం వారు జీర్ణించుకోలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థులు, నిరుద్యోగులు ప్రతిపక్షాల మాయలో పడకుండా కష్టపడి చదివి ప్రిలిమ్స్ పాసై ఉన్నారని, మెయిన్స్ పై దృష్టి పెట్టి మంచి ఫలితాలు సాధించాలని, ప్రజా పాలన అన్న విషయం మరవద్దని సూచించారు.

# ఆమనగల్లులో సిహెచ్ సి భవన నిర్మాణ పనుల పరిశీలన.

## ఎమ్మెల్యే ఆదేశానుసారం బేస్ ఎత్తు పెంపుకు చర్యలు.



ఆమనగల్లు, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
సోమవారం ఆమనగల్లు కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌ను కల్వకుర్తి ఎమ్మెల్యే శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి సందర్శించి, సిహెచ్ సి నూతన భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు భవన నిర్మాణానికి బేస్ ఎత్తు పెంచాలని సంబంధిత శాఖ అధికారులకు మరియు నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. మంగళవారం పంచాయతీరాజ్ శాఖ SE సురేందర్ రెడ్డి ఆదేశాల మేరకు EE రవీందర్ రెడ్డి, DE రవీందర్, AE బాల్ రెడ్డి సిహెచ్ సి భవన నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా, ఆసుపత్రి భవన బేస్ ఎత్తు పెంచడానికై సెంట్రింగ్ చెక్కను తొలగించి బేస్ ఎత్తు పెంచాలని నిర్మాణ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.

# హనుమాన్ టెంపుల్ దగ్గర మేక బలిపై కేసు నమోదు

మహేశ్వరం అక్టోబర్,22(నీలగిరి ఎక్స్ ప్రెస్)
గట్టుపల్లి హనుమాన్ టెంపుల్ వద్ద మేక బలిపై పోలీసుల కేసు నమోదు చేశారు. వీర హనుమాన్ ఆలయం పక్కన దర్గా వద్ద మేకను ఉమర్ బలి ఇవ్వడం కలకలం రేపింది. ఉమర్‌ను మహేశ్వరం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఉమర్ పై BNS 298, 299 కేసులు నమోదు చేశారు. మేక బలిపై వి హెచ్ పి నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. హిందువుల మనోభావాలు దెబ్బతిన్నాయని.. ఈ రెచ్చగొట్టే చర్యలకు పాల్పడిన వారిపై యాక్షన్ తీసుకోవాలని పలు ధార్మికసంఘాలు డిమాండ్ చేయడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

# అంగన్వాడి సెంటర్ ను పరిశీలించిన ఐఏఎస్ ఆఫీసర్స్..



నల్లగొండ జిల్లా అక్టోబర్ 22( నీలగిరి ఎక్స్‌ప్రెస్)
చింతపల్లి మండలంలోని జర్పుల తండా గ్రామపంచాయతీలో అంగన్వాడి సెంటర్ ను ఐఏఎస్ ఆఫీసర్స్ మంగళవారం నాడు పరిశీలించారు. స్కూల్లో జరుగుతున్న యాక్టివిటీస్ ను ,ఇన్ఫ్రాస్ట్రక్చర్ను ,ఆరోగ్య లక్ష్మి స్కీమును పరిశీలించారు. కొద్దిసేపు పిల్లలతో సరదాగా గడిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతి సెక్రటరీ కవిత, అంగన్వాడి సూపర్వైజర్ పార్వతి, అంగన్వాడి టీచర్. సరిత తదితరులున్నారు.

# కొమరం భీమ్ జయంతి వేడుకల్లో చిన్నారి సాయి సాకేత్

ఆమనగల్, సెప్టెంబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
ఆదివాసీల హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేసి అమరుడైన గిరిజన ఆరాధ్య దైవం కొమరం భీమ్ జయంతి సందర్భంగా ఆమనగల్ పట్టణంలో ఉన్న లిటిల్ స్కాలర్స్ స్కూల్ లో నాలుగవ తరగతి చదువుతున్న విడియాల సాయి సాకేత్, కొమరం భీమ్ వేషధారణలో పలువురుని ఆకట్టుకున్నాడు.



కొమరం భీమ్ వేషధారణలో విడియాల సాయి సాకేత్

# ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన యెన్నం హరికాంత్



వెల్దండ అక్టోబర్ 22( నీలగిరి ఎక్స్ ప్రెస్)
వెల్దండ మండల కేంద్రంలోని యెన్నమ్స్ హాస్పిటల్ చైర్మన్ హరికాంత్ రెడ్డి మంగళవారం తెలంగాణ రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహని హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు అనంతరం హరి కాంత్ రెడ్డి మాట్లాడుతూ వెల్దండ లో నర్సింగ్ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హాస్పిటల్ అడ్మిన్ గుజ్జుల రాకేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024




హైదరాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
మహాత్మా గాంధీ గ్లోబల్ పీస్ అవార్డు 2024 మరియు సేవా రత్న పురస్కారం 2024ను విద్యారత్న డాక్టర్. లయన్ కోమటి రెడ్డి గోపాల్ రెడ్డికి అందజేశారు. ఈ అవార్డులు మహాత్మా గాంధీ జయంతి మరియు అంతర్జాతీయ అసహన దినోత్సవం సందర్భంగా జరిగిన గ్రాండ్ ముగింపు వేడుకలో ప్రదానం చేశారు. తెలంగాణ సరస్వతి పరిషత్ ఆడిటోరియంలో 2 అక్టోబర్ నుండి 22 అక్టోబర్ 2024 వరకు జరిగిన ఈ వేడుకలో గోపాల్ రెడ్డి శాంతి, విద్య మరియు పర్యావరణ పరిరక్షణ కోసం నిరంతర కృషి చేసినందుకు గాను గౌరవించబడ్డారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులు మాజీ ఎంపీ డాక్టర్. బండా ప్రకాష్, ఎమ్మెల్సీ బోగ్గారపు దయానంద్, జస్టిస్ ఆర్. చంద్ర కుమార్, TRSMA రాష్ట్ర అధ్యక్షుడు మధుసూదన్ మరియు ఇతర ప్రముఖ జాతీయ అవార్డు గ్రహీతలు హాజరయ్యారు. ఈ ప్రతిష్టాత్మక అవార్డులు, గోపాల్ రెడ్డి విద్య మరియు నాయకత్వం ద్వారా శాంతి మరియు సుస్థిర ప్రపంచాన్ని ప్రోత్సహించినందుకు గుర్తింపుగా పొందారు.

# తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ నాన్ టీచింగ్ పోస్టుల కోసం దరఖాస్తులు ఆహ్వానం

కల్వకుర్తి, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
నాగర్ కర్నూల్ జిల్లాలోని తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కల్వకుర్తి (గుండాల గ్రామం వెల్దండ మండలంలో పని చేస్తున్న) నాన్ టీచింగ్ పోస్టులకు ఔట్సోర్సింగ్ పద్ధతిలో అర్హులైన అభ్యర్థుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహబూబ్ నగర్ ప్రాంతీయ అధికారి కళ్యాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.
పోస్టులు: క్యాటరింగ్ అసిస్టెంట్: 1 హాస్టల్ వార్డెన్ (మహిళా): 1 ఎలక్ట్రీషియన్ కమ్ ప్లంబర్: అసిస్టెంట్ కుక్ కిచెన్ హెల్పర్: 2
దరఖాస్తు ప్రక్రియ: ఆసక్తి గలవారు 23-10-2024 నుండి ప్రిన్సిపాల్ తెలంగాణ ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ కల్వకుర్తి నుండి దరఖాస్తు ఫారం పొందవచ్చు.
పూర్తి చేసిన దరఖాస్తుతో పాటు అన్ని అర్హతల ధ్రువీకరణ పత్రాలను 30-10-2024 సాయంత్రం 4:00 లోపు పాఠశాల యందు సమర్పించాలి.
పోస్టులకు అర్హత మార్కుల ఆధారంగా ఎంపిక చేయబడుతుంది అని
పోస్టులు తగ్గించడానికి లేదా పెంచడానికి మరియు ఈ ప్రకటన రద్దు చేయడానికి ప్రాజెక్ట్ ఆఫీసర్ ఐ టి డి ఏ మున్ననూర్ గారికి పూర్తి అధికారం ఉంది అని ఆమె తెలిపారు.
ఇతర సమాచారం కోసం 9704244232,9885738387 నెంబర్లను సంప్రదించాలని అన్నారు.


# కాంటింజెంట్ వర్కర్ల సదస్సులో జీతం, ఉద్యోగ భద్రతపై వినతులు





హైదరాబాద్, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
తెలంగాణ మెడికల్ పబ్లిక్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ హెచ్1 ప్రెసిడెంట్ కర్నాటి సాయిరెడ్డి అధ్యక్షతన జరిగిన రాష్ట్ర స్థాయి కాంటింజెంట్ వర్కర్ల సదస్సులో, కాంటింజెంట్ వర్కర్ల జీతాలు, ఉద్యోగ భద్రతపై వినతులు వినిపించారు. ప్రతినిధి బృందం డైరెక్టర్ డా.రవీంద్ర నాయక్ ని కలిసి, పార్ట్ టైమ్ కాంటింజెంట్ వర్కర్లను ఫుల్ టైమ్ గా మార్చి, 10,400/- జీతం ఇవ్వాలని, హెల్త్ కార్డులు, పెన్షన్ సౌకర్యం మరియు ఉద్యోగ భద్రత కల్పించాలని మెమోరాండం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జి. రాజశేఖర్, ఖమ్మం జిల్లా కార్యదర్శి సందీప్, ఎన్ హెచ్ ఎం కాంటింజెంట్ సంఘ అధ్యక్షులు అశోక్, కార్యదర్శి పాండు, ఫుల్ టైం, పార్ట్ టైం సంఘ అధ్యక్షులు హరిప్రసాద్, కార్యదర్శి సువార్త, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజసమయ్య తదితరులు పాల్గొన్నారు.

# తాండ్ర పాఠశాలలో కోతుల బెడదపై స్పందించిన గ్రామ కార్యదర్శి



కల్వకుర్తి, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్ ప్రెస్)
నీలగిరి ఎక్స్ప్రెస్ పత్రికలో ప్రచురించిన తాండ్ర గ్రామం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కోతుల బెడద వార్తపై గ్రామ కార్యదర్శి సాయి లీల స్పందించారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్ళి, కోతుల బెడద లేకుండా చర్యలు తీసుకుంటానని, అలాగే గ్రామంలో ఏ సమస్య అయినా పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నానని తెలిపారు.

# మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం అందజేసిన శాంతి గోపాల్



వెల్దండ, అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)
వెల్దండ మండల పరిధిలోని బర్కత్ పల్లి గ్రామానికి చెందిన రాములు మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న మాజీ వైస్ ఎంపీపీ శాంతి గోపాల్ రాములు కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి 5000 రూపాయలు ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అంజయ్య, కంచు యాదయ్య, గొడుగు వెంకటయ్య, గొడుగు జంగయ్య, పాల వెంకటయ్య, మల్లేష్ తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తూనికలు,కొలతల శాఖ అధికారుల దాడులు



వనపర్తి అక్టోబర్ 22 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):
అమరచింత మండల కేంద్రంలో మంగళవారం వనపర్తి జిల్లా తూనికలు,కొలతల శాఖ అధికారులు దాడులు నిర్వహించారు. పత్తి కొనుగోలు కేంద్రాల వద్ద కాంటాల పనితీరును పరిశీలించారు. నిర్ణీత బరువు కంటే తక్కువ బరువు నమోదైన డిజిటల్ ఎలక్ట్రానిక్ కాంటాను స్వాధీనం స్వాధీనం చేసుకొని దుకాణదారుడుపై కేసును నమోదు చేశారు. అక్రమాలకు పాల్పడేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని వనపర్తి జిల్లా తూనికలు కొలతల శాఖ అధికారి సత్యనారాయణ హెచ్చరించారు.

# వ్యవసాయ శాఖలో 156 మంది అధికారులను సస్పెండ్ చేయడం అన్యాయం: దేవిప్రసాద్

(నీలగిరి ఎక్స్‌ప్రెస్) హైదరాబాద్, అక్టోబర్ 22
వ్యవసాయ శాఖలో 156 మంది అగ్రికల్చర్ ఎక్స్టెన్షన్ అధికారులను సస్పెండ్ చేయడం అన్యాయమని, 2600 అధికారులను డిజిటల్ సర్వే చేయాలని ప్రభుత్వం కొంత కాలంగా వేధిస్తున్నదని, పనిభారం అధికంగా ఉందని చెప్పినా సమస్యను పరిష్కరించకుండా వేధింపులకు పూనుకోవడం సరికాదని దేవిప్రసాద్, మాజీ ఉద్యోగసంఘాల చైర్మన్, తెలిపారు. 31 జిల్లాలో 5గురు చొప్పున, మేడ్చల్ జిల్లా నుండి ఒక్కరిని మొత్తం 156 అధికారులను సస్పెండ్ చేయడం సరికాదని, రాష్ట్ర చరిత్రలో ఇలాంటి ఘటన తొలిసారి చోటు చేసుకోవడం బాధాకరమన్నారు. రైతు భరోసా ఇవ్వకుండా, రైతులను ఇబ్బంది పడేలా చేయడం, ఉద్యోగుల తో చర్చించి పనిభారాన్ని తగ్గించి వేధింపులు ఆపాలని డిమాండ్ చేశారు. సస్పెన్షన్ ఉత్తర్వులు తక్షణమే ఎత్తివేయాలని దేవిప్రసాద్ కోరారు.